కథానిక

# ఎదురుచూచిన కానుక

వై. వి. శర్మ

చదువుకునే రోజుల్లో తను అనుకునేవాడు, "ఉద్యోగులలో అవినీతి నిర్మూలనం చెయ్యాలి. ఒక్క దమ్మిడీ అయినా లంచం చేపట్టకూడదు" అని. కాని రామమూర్తికి ఈ ప్రపంచపోకడ సరిగా అర్థం కాలేదనే చెప్పాలి. ఎందుచేతంటే తను చేస్తున్న ఉద్యోగం తాలూకాగుమాస్తా. చుట్టూ తన ఆశయాలకు విరుద్ధమైన వాతావరణం. ఈ రోజుల్లో పదిమందితోబాటు లంచంపుచ్చుకోకపోవడమే ఒక పొరపాటుక్రింద పరిగణింపబడుతూంది. మోసమే పురుషార్థంగా, అనృతమే నిజాయితీగా చెలామణి అవుతున్నాయి. ఈ సమాజం స్థితి సామాన్యంగా ఇలాగే కనుపిస్తూంది. ఒకసారి హెడ్ క్లార్కు కూడా తనకు హితబోధ చేశాడు, "నాయనా, మాకూ ఆశయాలు, ఆదర్శాలూ ఉన్నాయి. కాని అవసరాలు వాటన్నిటినీ దిగత్రొక్కి మమ్మల్నీ దోవలో నడిపిస్తున్నాయి. నువ్వు కుర్రవాడవు. పదిపందితోటిదే లోకం" అని నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వుని అవహేళనగానే అర్థం చేసుకోగల్గింది రామమూర్తి మనస్సు.

రామమూర్తి యిప్పుడు ఫిర్కా సప్లయి ఆఫీసరు. ఇద్దరు బంట్రోతులు. ఆ ఫిర్కాలో అతనంటే ఎంతో గౌరవం, పలుకుబడీ. పెద్దపెద్ద భూస్వాములందరూ అతన్ని పిల్చి ఎన్నో టీ పార్టీలు యిచ్చారు. సన్మానసభలు చేశారు. ఏవైనా క్రొత్తసంస్థలుంటే, తన చేతనే ప్రారంభోత్సవం చేయించేవారు. ఈ సన్మాన గౌరవాలతో, సామాన్యమయిన ఆఫీసరయితే ఉబ్బితబ్బిబ్బయిపోయేవాడేమో కాని, రామమూర్తి మాత్రం యీ భూస్వాముల లంచమనే యెరలో పడేవాడు కాదు. పడకుండానే ఉండాలనే అతని ప్రయత్నం.

చంద్రయ్యచౌదరీ ఆ ఊరు గొప్పజమీందారు. వెయ్యిఎకరాల మాగాణి, అయిదు పెద్ద మిల్లులు, రెండు సినిమాహాల్సు, ఎంతోమంది నౌకర్లు. ముఖ్యంగా ఆ జిల్లాలోని తెల్లఖద్దరు టోపీధరించే ప్రముఖులలో ఒకడు, ప్రభుత్వం అంతా తనచేతిలోనే ఉన్నట్లు ప్రచారం చేసుకుంటూంటాడు. ఇంతవరకూ ఆయన రెండు మూడుసార్లు జిల్లాబోర్డు మెంబరు కూడా అయినా, మొన్న ఎలక్షన్లలో ఆ పార్టీ టిక్కెట్టు మీదనే ఎం. ఎల్. ఏ.కి పోటీచేసి, డిపాజిట్టు దక్కించుకుంటూ, ఓడిపోయాడు! ఆయన్ని ఎదిరించడానికి ఆ జిల్లాలో ఎవ్వరికీ సాహసం లేదంటారు ఆయన అనుచరులు కొందరు. ఆఫీసర్లని "ఇన్‌ఫ్లూయన్స్" చెయ్యటం బాగా తెలుసు.

ఆ జిల్లాలో ఒకచోటునుంచి యింకొకచోటుకి, బియ్యం లారీలమీద రాత్రింబగళ్ళనక, దొంగతనంగా, (అంటే పబ్లిక్‌గానే) రవాణా చెయ్యబడుతూంటుంది. ఆ వర్తకంలో చౌదరీగారిదే ఎక్కువ భాగం. ఆ తప్పుడు పద్ధతిని మాన్పించడమే తన ఆశయంగా తీసుకున్నాడు రామమూర్తి. ఆ విధంగా చెయ్యటంవల్ల, తన నిజాయితీని గవర్నమెంటు గ్రహించి పెద్ద ప్రమోషను పొందవచ్చని ఆశించాడు రామమూర్తి. ఇంతవరకూ వచ్చిన ఏ ఆఫీసరయినా, ఆయనవల్ల కొద్దోగొప్పో తిన్నవాళ్ళే. అందుచే జిల్లా ఆఫీసర్లుసహితం మన్నుతిన్న పాముల్లా పడిఉంటారు. పైగా వందిమాగధుల్లా, ఆయనకి జోహార్లు అర్పిస్తూ ఉంటారు.

* * *

ఆరోజు మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంది. రామమూర్తి భోజనం చేసి, తాంబూలం వేసి, ఈజీ చైర్‌లో కూర్చుని ఆరోజు పేపరు చదువుతున్నాడు. ప్రక్కనే బంట్రోతు వీరన్న కూర్చున్నాడు.

"బాబయ్యా, చౌదరీగారేమంటారో? యేటోనండి మీకెందుకొచ్చిందీగొడవ? ఆయన లారీ పట్టుకోడం దేనికి? పైగా రిపోర్టు ఏంటో రాశారటగదండీ బాబూ!" అంటూ వీరన్న అంటూంటే..

రామమూర్తి అడ్డుతగిలి, "ఒరే వీరన్నా! మన ఉద్యోగధర్మం మనం నిర్వర్తించాం తప్పేముంది? గవర్నమెంటు చెయ్యద్దన్న పని ఎందుకు చేయాలి?" అని ప్రశ్నించాడు.

"ఒక్కమాటచెప్తా వినండిబాబూ! పెద్దోళ్ళతోటి తగాలాటం యెందుకండీ, ఒక్కొళ్ళు ఏం చేసినా వినేవెవరు? గవర్నమెంటే చంద్రయ్యచౌదరి; చంద్రయ్యచౌదరే గవర్నమెంటు. మొన్న మనూరొచ్చిన మంత్రిగారు ఆరిచుట్టమేటండి. అంచేత బాబయ్యా, ఆ రిపోర్టు తీసెయ్యండి" అని వీరయ్య ప్రాధేయపడ్డాడు.

"నీకు ఈ విషయాలేమీ తెలియవురా, బుద్ధిః కర్మానుసారిణీ అన్నారు పెద్దలు" అని సావధానంగా అన్నాడు రామమూర్తి. అతని ధ్యేయమంతా తన ఆశయ నిర్వహణ, తన అంతరాత్మ ఆజ్ఞలను పరిపాలించటమే.

క్రితంరోజు రాత్రి చంద్రయ్యచౌదరీ లారీ పట్టుకొనటం, దానిపైన మునసబు కరణాల సాక్ష్యంతో రిపోర్టు తయారుచెయ్యటం జరిగింది. రామమూర్తికి ఈ విషయంగురించి ఎంతో మంది నచ్చ చెప్పబోయారు. తన ఉద్యోగ ధర్మం తను నిర్వర్తించక తప్పదన్నాడు. ఎలా అయినా ఆ రిపోర్టు తీయించెయ్యాలని చంద్రయ్య చౌదరీ, అతని అనుచరులూ ప్రయత్నం చేస్తున్నారు. చౌదరీ తాలూకా డిస్ట్రిక్టు సప్లయి ఆఫీసర్లను కలుసుకుని మాట్లాడాడు. ఆ ఉద్యోగులిద్దరూ, చౌదరీవల్ల కొద్దో గొప్పో తిన్నవాళ్లు కనుక, చౌదరీతో ఆ రిపోర్టు ఫిర్కా ఆఫీసరు చేత ఉపసంహరింప చేయించాలి అని సలహా యిచ్చారు; లేకపోతే తామేమీ చెయ్యలేమని ఎంతో విధేయతతో అన్నారు...

* * *

ఆదేరోజు సాయంత్రం రామమూర్తి ఎవరో పెద్దమనుష్యులతో మాట్లాడుతున్నాడు. తాను చదివింది బి.ఎ. తాను సంపాదించిన విజ్ఞానం దేనికోసం ఉపయోగించాలి? అని వితర్కించుకున్నాడు. చౌదరీకి ఎన్నోసార్లు చెప్పాడు ఆ వర్తకం మానమని కాని వినలేదు. ఎవరో నల్గురు క్రొత్త వ్యక్తులు వచ్చారు. వాళ్ళ నాహ్వానించాడు. ఇద్దరు ఖద్దరు వస్త్రధారులు; తెల్ల టోపీలు ధరించారు. తక్కిన యిద్దరూ చౌదరీ, అతని స్నేహితుడు కృష్ణయ్య. కృష్ణయ్య రామమూర్తికి పరిచితుడే. అతడు రామమూర్తితో, "వీరు మా డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటు రామిరెడ్డిగారు. వారు డిస్ట్రిక్టుబోర్డు మెంబరు సీతన్ననాయుడుగారు" అని వారిని పరిచయం చేశాడు. వారిద్దరిమధ్యా నమస్కార, ప్రతి నమస్కారాలు జరిగాయి. డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటు రామిరెడ్డిగారు కలుగచేసుకుని, "అయ్యా రామమూర్తిగారూ మీరు చిన్నవారు. ప్రపంచానుభవం తెలియదు. ఇకనుంచి మా చౌదరీ ఆ వర్తకం చెయ్యడని హామీ యిస్తున్నా. కాబట్టి తమరు ఆ రిపోర్టు ఉపసంహరించుకోవాలి" అని ప్రాధేయపడ్డాడు. కాని లాభంలేకపోయింది. "క్షమించాలి! ఈ విషయంలో మీరెవ్వరూ నన్ను బలవంతం చెయ్యవద్దు" ఇదే రామమూర్తిసమాధానం. వాళ్ళు వెళ్ళిపోయారు. పాపం! ఇంత కరెక్టుగా నడిచినా సరైన పారితోషికం లభించేందుకు ఇదేమీ బ్రిటిషువారి హయాముకాదని రామమూర్తి గ్రహించలేకపోయాడు. రెండువేల రూపాయలు లంచంయివ్వజూపారు. ఆ విషయం తన ఆశయానికే విరుద్ధమన్నాడు. తప్పకుండా, ఏదో ప్రమోషను చేయిస్తామన్నారు. తప్పుడు పద్ధతులద్వారా వచ్చిన ప్రమోషను తాను స్వీకరించనని ఖండితంగా చెప్పాడు. ఉద్యోగం ఊడుతుందనీ, చివరికి ప్రాణాలుగూడా దక్కవనీ బెదరించారు. కాని రామమూర్తి తనపట్టుదల వదలలేదు.

* * *

అలా 15రోజులు గడిచాయి. చౌదరీకి 1000 రూపాయలు జరిమానా విధించింది కోర్టు. చౌదరీ ఇచ్చుకోక తప్పింది కాదు. నెలరోజులు గడువక మునుపే రామమూర్తికి మద్రాసునుండి టెలిగ్రాంవచ్చింది. అందులో ఉద్యోగంలోంచి తనని బర్తరఫ్ చేసినట్టు ఉంది. తానుచేసిన సేవకు సరైనకానుక వచ్చిందనుకున్నాడు రామమూర్తి. చౌదరీవంటివాడిని బాధ పెడితే ఆ ఉసురు కొట్టదా అన్నారు చౌదరీ భక్తకోటిలోనివారు. రామమూర్తి తెలియని మూర్ఖుడంది ప్రపంచం.

ఇప్పుడు రామమూర్తి తనస్వగ్రామంలో పదిమంది పిల్లలకు చదువు చెప్పుకొంటూ కాలక్షేపం చేసుకుంటున్నాడు.